పుణె పాయె!

సాంట్నర్ ఏడు వికెట్లతో విజృంభణ

భారత్ తొలి ఇన్నింగ్స్ 156 ఆలౌట్

301 పరుగుల ఆధిక్యంలో కివీస్

సాంతగడ్డపై టెస్టుల్లో తమకు తిరుగేలేదనుకున్న భారత్‌కు న్యూజిలాండ్ దిమ్మతిరిగే షాక్‌లు ఇస్తున్నది. బెంగళూరులో పదునైన పేస్‌తో టీమ్‌ఇండియాకు ఘోర ఓటమి రుచి చూపించిన కివీస్..పుణెలో స్పిన్‌తో పట్టు బిగించింది. లెఫ్టార్మ్ స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ ఏడు వికెట్ల విజృంభణతో భారత్ 156 పరుగులకే కుప్పకూలింది. స్టార్ బ్యాటర్ కోహ్లీ సింగిల్ డిజిట్‌తో భారంగా పెవిలియన్ చేరగా, మిగతా వాళ్లు అంతో ఇంతో ఫర్వాలేదనిపించారు. కివీస్ స్పిన్నర్లు రెచ్చిపోయిన పిచ్‌పై భారత స్పిన్నర్లు ప్రభావం చూపని వేళ కివీస్ ప్రస్తుతం 301 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. ఇదే దూకుడు కొనసాగిస్తూ భారత్ ముందు భారీ లక్ష్యం నిర్దేశిస్తే.. చారిత్రక సిరీస్ విజయం కివీస్ సొంతమైనట్లే. మూడో రోజు ఆట రసపట్టుగా సాగే అవకాశముంది.

సాంట్నర్ (7/53)

పుణె: ఎవరూ తీసుకున్న గోతిలో వాళ్లే పడ్డట్లు ఉంది భారత క్రికెట్ జట్టు పరిస్థితి. పిచ్‌ను అంచనా వేయడంలో విఫలమై బెంగళూరులో భారీ ఓటమి మూటగట్టుకుంటే సిరీస్ గెలువాలంటే కచ్చితంగా గెలువాల్సిన పుణెలో మనోళ్లు ఆపసోపాలు పడుతున్నారు. కొట్టిన పిండి ల్లాంటి సొంత పిచ్‌లపై గల్లీ క్రికెటర్లను తలపిస్తూ అభిమానుల ఆగ్రహానికి గురవుతున్నారు. భారత బ్యాటర్లు విఫలమైన చోట స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ కివీస బ్యాటర్లు అదరగొడుతున్నారు. కెప్టెన్ టామ్ లాథమ్(86) అర్ధసెంచరీతో కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 198/5 స్కోరు చేసింది. టామ్ బ్లండెల్(30 నాటౌట్), గ్లెన్ ఫిలిప్స్(9 నాటౌట్) క్రీజులో ఉన్నారు. వాషింగ్టన్ సుందర్(4/56) నాలుగు వికెట్లతో రాణించాడు. అంతకముందు ఓవర్‌నైట్ స్కోరు 16/1తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన భారత్ 45.3 ఓవర్లలో 156 పరుగులకు కుప్పకూలింది. జడేజా(38), గిల్(30), జైస్వాల్(30) ఫర్వాలేదనిపించారు. కోహ్లీ(1), పంత్(18), సర్ఫరాజ్‌ఖాన్(11), అశ్విన్(4) ఘోరంగా విఫలమయ్యారు. సాంట్నర్(7/53) ఏడు వికెట్ల విజృంభణతో టీమ్‌ఇండియా పతనంలో కీలకమయ్యాడు. ఊరించే బంతులతో భారత బ్యాటర్లను సాంట్నర్ అద్భుతంగా బోల్తా కొట్టించాడు. చేతిలో ఐదు వికెట్లు ఉన్న కివీస్ ప్రస్తుతం 301 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. ఇదే దూకుడు కొనసాగిస్తూ భారీ లక్ష్యాన్ని నిర్దేశించి భారత్‌ను కట్టడి చేసేందుకు కివీస్ పట్టుదలతో ఉంది. మూడో రోజు ఆటలో తొలి సెషన్ టీమ్ ఇండియాకు కీలకం కానుంది.

సాంట్నర్ సాత్ ధమాకా:

భారత స్పిన్నర్లు ప్రభావం చూపని చోట కివీస్ స్పిన్నర్లు తమదైన స్పిన్ మాయాజాలంతో చెలరేగిపోయారు. ఓవైపు సాంట్నర్ ఏడు వికెట్లు కూలిస్తే..పార్ట్ టైమర్ ఫిలిప్స్ (2/26) రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. ఓవర్‌నైట్ స్కోరుతో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన టీమ్‌ఇండియా ఆది నుంచే తడబడింది. జట్టు స్కోరు 50 పరుగుల వద్ద గిల్‌ను సాంట్నర్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆ తర్వాత 6 పరుగుల తేడాతో కోహ్లీ మూడో వికెట్‌గా ఔటయ్యాడు. సాంట్నర్ ఊరించే ఫుల్‌టాస్ బంతిని సరిగ్గా అర్థం చేసుకోని కోహ్లీ..బ్యాటును అడ్డంగా ఊపడంతో బంతి నేరుగా వికెట్లను గిరాటేసింది. దీంతో ఒక్కసారిగా స్టేడియంలో నిశబ్ద వాతావరణం అలుముకుంది. జైస్వాల్..ఫిలిప్స్ బౌలింగ్‌లో మిచెల్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. పంత్‌ను ఫిలిప్స్ క్లీన్‌బౌల్డ్ చేయగా, సర్ఫరాజ్‌ను సాంట్నర్ పెవిలియన్ పంపాడు. అశ్విన్, జడేజా, ఆకాశ్ దీప్(6), బుమ్రా(0)ను సాంట్నర్ ఔట్ చేయగా, సుందర్(18) నాటౌట్‌గా నిలిచాడు.

కోహ్లీ (1)

సంక్షిప్త స్కోర్లు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 259 ఆలౌట్, భారత్ తొలి ఇన్నింగ్స్: 156 ఆలౌట్(జడేజా 38, జైస్వాల్ 30, సాంట్నర్ 7/53), ఫిలిప్స్ 2/26), న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: 198/5(లాథమ్ 86, బ్లండెల్ 30 నాటౌట్, సుందర్ 4/56, అశ్విన్ 1/64)

ఆలిండియా తైక్వాండో టోర్నీకి భువన్‌కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో టోర్నీకి హైదరాబాద్ విద్యార్థి బొల్లం భువన్‌కుమార్ ఎంపికయ్యాడు. మర్రి లక్ష్మణ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో చదువుతున్న భువన్ కుమార్ జేఎన్టీయూ తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. నవంబర్ 6 నుంచి 9 వరకు అమృత్‌సర్‌లోని గురు నానక్ వర్సిటీలో జరగనున్న పోటీల్లో భువన్ తలపడనున్నాడు. ఈ సందర్భంగా జేఎన్టీయూ అధికారులు భువన్‌ను అభినందించారు

ఖో ఖో ప్రపంచకప్‌లో ఇంగ్లండ్, జర్మనీ

న్యూఢిల్లీ: భారత్ వేదికగా తొలిసారి జరుగబోతున్న ఖోఖో ప్రపంచకప్‌లో ఆయా జట్ల ప్రాతినిధ్యంపై ఆసక్తి ఏర్పడింది. జనవరిలో జరుగనున్న అరంగేట్రం ఖో ఖో ప్రపంచ పోరులో మొత్తం 24 జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం వేదికగా జరిగే ఈ మెగా టోర్నీలో అన్ని ఖండాలకు అవకాశం కల్పిస్తున్నారు. ఆఫ్రికా నుంచి ఘనా, కెన్యా, దక్షిణాఫ్రికా, ఉగాండా ఉన్నాయి.

డేవిడ్ వార్నర్‌కు ఊరట

సిడ్నీ: ఆస్ట్రేలియా డాషింగ్ క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు ఊరట లభించింది. 2018 సాండ్‌పేపర్ గేట్ వివాదంలో వార్నర్‌పై ఇన్ని రోజులుగా ఉన్న లైఫ్ టైమ్ కెప్టెన్సీ, లీడర్‌షిప్ నిషేధాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) తాజాగా ఎత్తివేసింది. ముగ్గురు సభ్యులతో కూడిన స్వతంత్ర ప్యానెల్ శుక్రవారం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నెల మొదట్లో ప్యానెల్ ముందు విచారణకు హాజరైన వార్నర్..నిర్దేశిత ప్రమాణాలు అందుకున్నాడని భావించి సస్పెన్షన్ ఎత్తివేసినట్లు తెలుస్తున్నది. ఇప్పటికే వన్డే కెరీర్‌కు వీడ్కోలు పలికిన వార్నర్..ఆసీస్ తరపున టీ20ల్లో ఆడుతున్నాడు.

నవంబర్ నెలాఖరులో స్పోర్ట్స్ పాలసీ

సిద్ధం చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ క్రీడా విధానానికి(స్పోర్ట్స్ పాలసీ) సంబంధించిన తుది ముసాయిదాను నవంబర్ నెలాఖరులోగా సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యుత్తమ పాలసీని రూపొందించాలన్నారు. ఇందుకోసం విస్తృత అధ్యయనం, నిపుణులు, క్రీడాకారులతో సంప్రదింపులు జరుపాలని సూచించారు. శుక్రవారం స్పోర్ట్స్ పాలసీపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. 'రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వాడుకోవాలి. ఇప్పటికే ఉన్న స్టేడియాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా మార్చాలి. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సంబంధించిన బిల్లు ముసాయిదా వీలైనంత త్వరగా రూపొందించాలి. స్పోర్ట్స్ పాలసీలో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ, సాట్స్ కలిసి సంయుక్తంగా పనిచేయాలి. దక్షిణకొరియాతో పాటు ఆస్ట్రేలియాలోని క్వీన్‌ల్యాండ్ యూనివర్సిటీలో అనుసరిస్తున్న విధానాలను పరిశీలనలోకి తీసుకోవాలి. వచ్చే రెండేండ్లలో తెలంగాణలో జాతీయ గేమ్స్ జరిగేలా ఇప్పటి నుంచే అధికారులు ప్రణాళికలు తయారుచేయాలి' అని అన్నారు. ఈ భేటీలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సలహాదారు కేశవ రావు, జితేంతర్‌రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, క్రీడాశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్ పాల్గొన్నారు.

ఇంగ్లండ్ 24/3

పాకిస్థాన్‌తో మూడో టెస్టు

రావల్పిండి: పాకిస్థాన్‌తో జరుగుతున్న మూడో టెస్టులో ఇంగ్లండ్ ఇబ్బందుల్లో పడింది. పాక్ స్పిన్నర్ల ఆధిపత్యం కొనసాగుతున్న వేళ..ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు కోల్పోయి 24 పరుగులు చేసింది. చేతిలో ఏడు వికెట్లు ఉన్న ఇంగ్లండ్ 53 పరుగుల వెనుకంజలో కొనసాగుతున్నది. రూట్(5), బ్రూక్(3) క్రీజులో ఉన్నారు. నోమన్ అలీ(2/9), సాజిద్‌ఖాన్(1/14) రాణించారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 73/3తో తొలి ఇన్నింగ్స్‌కు దిగిన పాక్ 344 పరుగులకు ఆలౌటైంది. సౌద్ షకీల్ (134) సెంచరీతో విజృంభించగా, అలీ(45), సాజిద్‌ఖాన్ (48 నాటౌట్) ఆకట్టుకున్నారు. రేహాన్ అహ్మద్(4/66), బషీర్ (3/129) పాక్ పతనంలో కీలకమయ్యారు.

బ్యాడ్మింటన్ చాంప్స్ శశాంక్, జ్ఞానదత్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: చెన్నై వేదికగా జరిగిన 36వ జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో శశాంక్, జ్ఞానదత్ విజేతలుగా నిలిచారు. శుక్రవారం ముగిసిన టోర్నీలో బాలుర అండర్-15 సింగిల్స్ ఫైనల్లో గోపీచంద్ అకాడమీ ప్లేయర్ శశాంక్ 21-9, 15-21, 21-17తో పుష్కర్‌సాయి(కర్నాటక)పై గెలిచాడు. మరోవైపు అండర్-17 సింగిల్స్ తుదిపోరులో జ్ఞానదత్ 21-12, 8-21, 21-17తో జగ్‌షేర్‌సింగ్(పంజాబ్)పై గెలిచి టైటిల్ దక్కించుకున్నాడు. విజేతలను గోపీచంద్‌తో పాటు రంగారెడ్డి బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరావు, నిఖిల్ అభినందించారు.

టెస్టు టీమ్‌లోకి నితీశ్

- **ఆసీస్, దక్షిణాఫ్రికా సిరీస్‌లకు జట్ల ఎంపిక**

ముంబై: దక్షిణాఫ్రికాతో నాలుగు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో పాటు ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ(బీజీటీ) కోసం బీసీసీఐ రెండు వేర్వేరు జట్లను ప్రకటించింది. శుక్రవారం భేటీ అయిన సెలెక్షన్ కమిటీ ఓవైపు యువకులతో కూడిన జట్టుతో పాటు ఆసీస్ టెస్టు సిరీస్‌కు అనుభవానికి పెద్దపీట వేసింది. ఇటీవలే టీ20ల్లో ఇరుగదీసిన తెలుగు క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డి తొలిసారి టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు. ఆసీస్‌లోని పేస్ పిచ్‌లను దృష్టిలో పెట్టుకున్న సెలెక్టర్లు ఆల్‌రౌండర్ నితీశ్ వైపు మొగ్గుచూపారు. ఇప్పటికే ఆసీస్ 'ఎ'తో సన్నాహక మ్యాచ్‌ల కోసం భారత్ 'ఎ' తరపున నితీశ్ బరిలోకి దిగుతున్నాడు. మిగతా ప్లేయర్ల విషయానికొస్తే...ఫామ్‌మీదున్న సర్ఫరాజ్‌ఖాన్‌తో పాటు అభిమన్యు ఈశ్వరన్, వాషింగ్టన్ సుందర్, రాహుల్, జురెల్ జట్టులో చోటు దక్కించుకున్నారు. గాయం కారణంగా స్పిన్నర్ కుల్దీప్‌యాదవ్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్ కోసం ఎంపిక చేసిన టీమ్‌లో రమణ్‌దీప్‌సింగ్, విజయ్‌కుమార్, యశ్ దయాల్ చోటు దక్కించుకున్నారు.

రమణ్‌దీప్ పోరాటం వృథా

అఫ్గన్ 'ఎ' చేతిలో భారత్ 'ఎ' ఓటమి

అల్ అమెరాత్(ఒమన్): ఏసీసీ ఎమర్జింగ్ ఆసియా కప్ టీ20లో యువ భారత్ పోరాటం ముగిసింది. టైటిల్ ఫెవరేట్లలో ఒకటిగా బరిలోకి దిగిన భారత్ 'ఎ'..కీలకమైన సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్ 'ఎ' చేతిలో పోరాడి ఓడింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో తిలక్‌వర్మ సారథ్యంలోని టీమ్‌ఇండియా 20 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. అఫ్గన్ నిర్దేశించిన 207 పరుగుల లక్ష్యఛేదనలో యువ భారత్ 20 ఓవర్లలో 186/7 స్కోరుకు పరిమితమైంది. మిడిలార్డర్ బ్యాటర్ రమణ్‌దీప్‌సింగ్(34 బంతుల్లో 64, 8ఫోర్లు, 2సిక్స్‌లు) ఒంటరిపోరాటం జట్టును గెలిపించలేకపోయింది. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్‌సింగ్(19), అభిషేక్‌శర్మ(7) విఫలంకాగా, మిడిలార్డర్‌లో తిలక్‌వర్మ(16), ఆయూశ్ బదోనీ(31), నేహాల్(20) అంతో ఇంతో పరుగులు సాధించారు. సహచరులు ఔటైనా రమణ్‌దీప్..కడదాకా గెలుపు కోసం ప్రయత్నించాడు. గజన్‌ఫర్, రెహ్మాన్ రెండేసి వికెట్లు తీశారు. తొలుత సెదీఖుల్లా(83), జుబైద్ అక్బరీ(64) అర్ధసెంచరీలతో అఫ్గన్ 20 ఓవర్లలో 206/4 స్కోరు చేసింది. రసిక్ సలామ్(3/25) ఆకట్టుకున్నాడు.

చిత్రం

మల్లయుద్ధ యోధునిగా

రామ్‌చరణ్ 'గేమ్‌చేంజర్' సంక్రాంతికి విడుదల కానుంది. సినిమా ప్రమోషన్స్‌ని కూడా నిర్మాత దిల్‌రాజు మొదలుపెట్టారు. ఈ సినిమాకు సంబంధించిన తన వర్కంతా రామ్‌చరణ్ పూర్తి చేసుకున్నారు. ఇక ప్రమోషన్స్‌కి కొన్ని రోజులు కేటాయిస్తే సరిపోతుంది. ప్రస్తుతం రామ్‌చరణ్ దృష్టి అంతా బుచ్చిబాబు సాన సినిమాపైనే. శ్రీకాకుళం నేపథ్యంలో సాగే స్పోర్ట్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కనున్నది. ఇందులో చరణ్ మల్లయుద్ధ వీరుడిగా కనిపిస్తాడని సమాచారం. మల్లయుద్ధం అనగానే గుర్తొచ్చే పేరు కోడి రామమూర్తి. ఉత్తరాంధ్రకు చెందిన ఈ యోధుడి జీవితమే ప్రేరణగా బుచ్చిబాబు కథ రాసుకున్నారట. జాన్వీ కపూర్ కథానాయికగా నటించనున్నది. ఏఆర్ రెహ్మాన్ సంగీత దర్శకత్వంలో ఇప్పటికే మూడు పాటలను రికార్డ్ చేశారు. డిసెంబర్ ఫస్ట్ వీక్‌లో సినిమా సెట్స్‌కి వెళ్లనున్నట్టు సమాచారం. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

జ్యోతిర్లింగాల సందర్శన

మంచు విష్ణు కథానాయకుడిగా తెరకెక్కుతున్న భక్తిరస ప్రధాన చిత్రం 'కన్నప్ప'. ముఖేష్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా బృందం ద్వాదశ జ్యోతిర్లింగాల సందర్శనలో భాగంగా కేథార్‌నాథ్, బద్రీనాథ్, రిషికేశ్‌లను సందర్శించింది. ఈ సందర్భంగా మంచు విష్ణు మాట్లాడుతూ 'పరమ శివుడి భక్తుడి కథతో 'కన్నప్ప' చిత్రాన్ని రూపొందిస్తున్నాం. సినిమా రిలీజ్‌కు ముందే మొత్తం పన్నెండు జ్యోతిర్లింగాలను దర్శించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. విజువల్ వండర్‌గా ఆధ్యాత్మిక, భక్తి ప్రధాన అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం' అన్నారు. ఈ చిత్రంలో మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్, శరత్‌కుమార్ వంటి అగ్ర తారలు భాగమవుతున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది.

చాలా బాధ పడ్డాను

సాయిపల్లవి అనగానే.. సంప్రదాయబద్ధమైన భారతీయ స్త్రీ గుర్తొస్తుంది. తను వేడుకల్లోనే కాదు, సినిమాల్లోనూ వేషధారణ విషయంలో ఎక్కడా పరిధులు దాటలేదు. సాయిపల్లవి నటించిన 'అమరన్' సినిమా ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో తన జీవితంలో ఎదురైన చేదు అనుభవాన్ని గుర్తు చేసుకున్నది సాయిపల్లవి. 'మెడిసన్ చేయడానికి జార్జియా వెళ్లి అక్కడ టాంగో డ్యాన్స్ నేర్చుకున్నా. ఆ డ్యాన్స్‌కి ప్రత్యేకమైన కాస్ట్యూమ్స్ ఉంటాయి. నాట్యధర్మానికి అనుగుణంగా అవి ధరించి చేస్తేనే ఆ నాట్యానికి అందం. అందుకే.. వాటిని ధరించక తప్పలేదు. అది కూడా నేను సౌకర్యంగా ఫీలయ్యాకే ఆ కాస్ట్యూమ్స్ ధరించా. స్టేజ్‌పై ప్రదర్శన కూడా ఇచ్చా. కొంతకాలానికి 'ప్రేమమ్'లో అవకాశం రావడం నటిగా బిజీ అయిపోవడం జరిగిపోయింది. కానీ ఉన్నట్టుండి జార్జియాలో నేను చేసిన టాంగో డ్యాన్స్ వీడియో ఒకటి సోషల్ మీడియాలో ట్రోల్ అవ్వడం మొదలైంది. పైగా దాని కింద అసభ్యకరమైన కామెంట్లు. నిజంగా చాలా బాధ అనిపించింది. శరీరం కనిపించేలా దుస్తులు వేసుకోవడం నాకు ఇష్టం ఉండదు. నటిగా మారాక అది ఒక నియమంలా పెట్టుకున్నాను. నా నియమాన్ని గౌరవించిన వారి సినిమాలే చేస్తున్నా. డ్యాన్స్ మీద ప్రేమతో చదుకునే రోజుల్లో చేసిన డ్యాన్స్ వీడియో అది. దానిని ట్రోల్ చేసి, నా ఆత్మాభిమానాన్ని దెబ్బతీయాలని చూశారు' అంటూ చెప్పుకొచ్చింది సాయిపల్లవి.

అక్కినేని లెగసీకి ఇది తగిన నివాళి

నటసామ్రాట్ స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు జాతీయ పురస్కారాన్ని 2024వ సంవత్సరానికి గాను అగ్ర నటుడు చిరంజీవికి ఇవ్వనున్నట్టు అక్కినేని కుటుంబం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 28న జరిగే ప్రదానోత్సవ కార్యక్రమంలో చిరంజీవి ఈ అవార్డును అందుకోనున్నారు. పలువురు సినీరంగ రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఇదిలావుంటే.. పురస్కార స్వీకర్త చిరంజీవిని శుక్రవారం అక్కినేని నాగార్జున మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రాన్ని అందించి, వేడుకకు ఆహ్వానించారు. అక్కినేని అవార్డు అందుకునేందుకు పరిపూర్ణమైన అర్హత గల నటుడు చిరంజీవి అని, తెలుగు చిత్రపరిశ్రమ తరపున పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్న తొలి వ్యక్తి అక్కినేని అయితే.. మలి వ్యక్తి చిరంజీవి అని నాగార్జున గుర్తుచేశారు. అందుకే.. ఈ నెల 28న జరిగే పురస్కార ప్రదాన సభలో పద్మవిభూషణ్ అక్కినేని పురస్కారాన్ని, అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా చిరంజీవి అందుకుంటారని నాగార్జున శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. 'మా నాన్న ఏఎన్ఆర్ శతజయంతి వేడుకలు జరుపుకుంటున్న ఈ సంవత్సరం మాకు చాలా ప్రత్యేకం. ఈ మైలురాయికి గుర్తుగా 'ఏఎన్ఆర్ అవార్డ్స్ 2024'కి అమితాబ్, చిరంజీవిగార్లను ఆహ్వానించడం ఆనందంగా ఉంది. ఈ అవార్డు వేడుకను మరపురానిదిగా చేద్దాం' అంటూ నాగ్ తన ఎక్స్ ద్వారా స్పందించారు. ఈ సందర్భంగా చిరంజీవిని తాను ఆహ్వానిస్తున్న ఫొటోలను కూడా నాగ్ షేర్ చేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు బాగా వైరల్ అవుతున్నాయి.

ఇఫీలో 'మొనిహార'

వారాల అన్వేష్ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ

కరీంనగర్‌కు చెందిన వారాల అన్వేష్ డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీగా రూపొందించిన సినిమా 'మొనిహార' 55 వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి ఎంపికయింది. ఈ విషయాన్ని కేంద్ర సమాచార ప్రసార శాఖ శుక్రవారం ప్రకటించింది. భారత కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 55 వ 'ఇఫీ' (ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా) నవంబర్ 20 నుంచి 28 వరకు గోవా లో జరుగుతుంది. వివిధ భారతీయ భాషల్లోంచి వచ్చిన నాన్ ఫీచర్ సినిమాల్లోంచి ఎంపికయిన వాటిల్లో 'మొనిహార' కూడా ఉంది. ఈ చిత్రం బెంగాలీ భాషలో నిర్మించారు. కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిలిం ఇనిస్టిట్యూట్‌లో వారాల అన్వేష్ సినిమాటోగ్రఫీలో పీజీ కోర్స్ పూర్తి చేశాడు. విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ రాసిన 'మొనిహార' కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ చిత్రానికి సుభాదీప్ బిస్వాస్ దర్శకత్వ బాధ్యతల్ని నిర్వహించారు. ఇక గతంలో వారాల అన్వేష్ సినిమాటోగ్రాఫర్‌గా రూపొందిన 'అపార్' మరియు 'నవాబి శౌక్' చిత్రాలు ఇండో బంగ్లాదేశ్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్‌తో సహా అనేక అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్ లో ప్రదర్శింపబడి ప్రశంసల్ని అందుకున్నాయి. ఇంకా అన్వేష్ తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన పట్నాలపైన పూర్తి నిడివి డాక్యుమెంటరీ తీసాడు. అది హైదరాబాద్ లో జరిగిన బతుకమ్మ ఫిలిం ఫెస్టివల్ లో ప్రదర్శించబడింది.

'జాతర'లో ప్రేమకథ

స్వీయ దర్శకత్వంలో సతీష్‌బాబు రాటకొండ హీరోగా నటిస్తున్న చిత్రం 'జాతర'. రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మాతలు. నవంబర్ 8న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా దర్శకుడు, హీరో సతీష్‌బాబు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. చిత్తూరు జిల్లా జాతర నేపథ్యంలో భావోద్వేగభరితమైన కథాంశంతో ఆకట్టుకుంటుంది. యాక్షన్ సన్నివేశాలు హైలైట్‌గా నిలుస్తాయి' అని చెప్పారు. దీయారాజ్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కె.వి.ప్రసాద్, సంగీతం: శ్రీజిత్ ఎడవణ, రచన-దర్శకత్వం: సతీష్‌బాబు.

నిజముగ మారె కలలే..

కన్నడ హీరో శ్రీమురళి హీరోగా రూపొందిన యాక్షన్ ఎంటర్టైనర్ 'బఘీర'. అగ్రదర్శకుడు ప్రశాంత్‌నీల్ కథ అందించారు. డాక్టర్ సూరి దర్శకుడు. విజయ్ కిరగందూర్ నిర్మాత. ఈ నెల 31న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా రెండో పాటను మేకర్స్ విడుదల చేశారు. 'పరిచయమేలె పరిచయమేలె నిజముగ మారె కలలే..' అంటూ సాగే ఈ పాటను రాంబాబు గోసాల రాయగా, బి.అజనీష్ లోక్‌నాథ్ స్వరపరిచారు. రితేష్ జి.రావు ఆలపించారు. హీరోహీరోయిన్ల కెమిస్ట్రీని ఈ పాటలో అందంగా ఆవిష్కరించారు. మహిళలకు హాని కలిగించేవారిపై కఠిన చర్యలు తీసుకొనే టఫ్ పోలీస్‌గా ఈ పాటలో శ్రీమురళి కనిపిస్తుంటే, సున్నితమైన మనస్తత్వం కలిగిన డాక్టర్‌గా రుక్మిణి దర్శనమిస్తున్నది. రెండు భిన్నవ్యక్తిత్వాల ప్రేమను ఈ పాట ఆవిష్కరించింది. ప్రకాశ్‌రాజ్, రంగాయణరఘు, అచ్యుత్‌కుమార్, గరుడరామ్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ఏ.జె.శెట్టి, విడుదల: ఏషియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్ ఎల్ఎల్పి.

కొత్త ప్రపంచాన్ని చూస్తారు

'చాలా కొత్త కంటెంట్‌తో 'క' సినిమా చేశాను. ఫస్ట్‌సీన్ నుంచి లాస్ట్ సీన్ వరకూ సినిమా కొత్తగా ఉంటుంది. స్క్రీన్‌ప్లే యూనిక్‌గా ఉంటుంది. 'క'లో ఓ కొత్త ప్రపంచాన్ని చూస్తారు. ఇందులో సీజీ వర్క్‌కు కూడా చాలా ప్రాధాన్యత ఉంది. ఈ సినిమా బాగా రావడానికి కారణం అద్భుతమైన టీమ్ కుదరడమే. దీపావళికి మిమ్మల్ని బాగా ఎంటర్టైన్ చేసే సినిమా 'క'.' అని హీరో కిరణ్ అబ్బవరం నమ్మకంతో చెప్పారు. ఆయన కథానాయకుడిగా నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీరామ్ కథానాయికలు. సుజీత్, సందీప్ కలిసి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాత. ఈ నెల 31న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో కిరణ్ అబ్బవరం మాట్లాడారు. ఓ కొత్త అనుభూతిని కలిగించే సినిమా ఇదని, ఇందులో కిరణ్ కొత్తగా కనిపిస్తాడని దర్శకులు చెప్పారు. ఇందులో సత్యభామ అనే బ్యూటిఫుల్ రోల్ చేశానని కథానాయిక నయన్ సారిక అన్నారు. ట్రైలర్‌కి వందరెట్లు గొప్పగా సినిమా ఉంటుందని, కుటుంబసమేతంగా చూడదగ్గ సినిమా ఇదని నిర్మాత పేర్కొన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur,